
ఒంగోలు: ఎస్టీ సంక్షేమ వసతి గృహంలోకి బయట నుంచి వస్తున్న మురుగునీరు


త్రోవగుంటలో అరకొర వసతులతో అద్దె భవనంలో నడుస్తున్న సంక్షేమ వసతి గృహం


చీమకుర్తి: హాస్టల్‌లో ప్రదర్శించిన మెనూ టేబుల్


చీమకుర్తి: ట్యాప్‌లు, నీటి వసతి లేని వాష్ ఏరియా


చీమకుర్తి: హాస్టల్లో పెచ్చులూడుతున్న సీలింగ్


మద్దిపాడు ఎస్సీ హాస్టల్ వద్ద మురుగు నిల్వలు


ఒంగోలు: ప్రభుత్వ బాలుర వసతి గృహంలో స్టడీ అవర్స్‌లో నేలపై కూర్చున్న విద్యార్థులు


ఒంగోలు: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు


ఒంగోలు: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం పక్కనే ప్రమాదకరంగా ఉన్న శిథిల భవనం

జాడ లేని సంక్షేమం

- సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాల కొరత
- గదులు, మరుగుదొడ్లు సరిపోక విద్యార్థులకు అవస్థలు

ఒంగోలు సెంట్రల్:

నూతన ప్రభుత్వ నిర్లక్ష్యంతో సంక్షేమ హాస్టళ్లు సమస్యల నిలయాలుగా మారాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పాటు ప్రస్తుత విద్యాసంవత్సరం కూడా ప్రారంభమైంది. దాదాపు రెండున్నర నెలలు కావస్తున్నా సంక్షేమ వసతి గృహాల నిర్వహణకు తగిన నిధులు ఇవ్వకపోవడంతో వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. తగినన్ని ఫ్యాన్లు ఏర్పాటు చేయకపోవటంతో పాటు విద్యుత్ బోర్డుల నిర్వహణ సక్రమంగా లేదు. ఒంగోలు నగరంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాలు 16 ఉండగా, వాటిలో 10 అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఒంగోలు అంజయ్యరోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమశాఖ ప్రభుత్వ కళాశాల వసతి గృహం పక్కనే శిథిలావస్థకు చేరిన భవనాలు తొలగించకుండా ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పలు భవనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. డీఆర్‌ఆర్‌ఎం స్కూల్‌కు పక్కనున్న సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం పూర్తిగా ధ్వంసమైంది. అయితే, ఆ భవనం స్థానంలో కొత్తది మంజూరు కావడంతో విద్యార్థులను అప్పటివరకు మరో భవనంలోకి మార్చనున్నారు. ఎస్టీ బాలుర వసతి గృహం వీధిలో లైట్లు లేకపోవటంతో బయటకు రావాలంటే విషపురుగులు బారిన పడతామని విద్యార్థులు భయపడుతున్నారు. వర్షం కురిసిన సమయంలో ఆ ప్రాంతంలోని జీజీహెచ్ మురుగునీరంతా వసతి గృహ ప్రాంగణంలోకి వచ్చి దుర్వాసన వస్తోంది. మరుగుదొడ్లు కూడా సరిపడినన్ని లేకపోవడం, అందులో నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మస్కిటో కాయిల్స్, కాస్మోటిక్ చార్జీలు మంజూరు చేయలేదు. సోప్స్, ఆయిల్, హెయిర్ కటింగ్‌కు కూడా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

అధ్వానంగా సదుపాయాలు...

చీమకుర్తి: సంక్షేమ హాస్టళ్లలో సదుపాయాలు సక్రమంగా లేక విద్యార్థులు తీవ్ర అవస్థలుపడుతున్నారు. తాగునీరు లేక కొన్నిచోట్ల బోరు నీటినే ఉపయోగిస్తున్నారు. బాత్‌రూములు, టాయ్‌లెట్లకు తలుపులు, రన్నింగ్ వాటర్ లేక విద్యార్థులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. చీమకుర్తిలోని ఎస్సీ బాలికల హాస్టల్ సామర్థ్యం 100 మంది కాగా ప్రస్తుతం 230 మంది బాలికలు చేరారు. నికరంగా 200 మంది బాలికలు ఉంటున్నారు. మొత్తం 6 రూములుండగా, ఒక్కో రూములో 30 నుంచి 40 మంది ఇరుక్కొని పడుకోవాల్సి వస్తోందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసతి రూములే ఇంత దారుణంగా ఉండగా, ఇక బాత్‌రూములు, టాయ్‌లెట్లు దుస్థితి గురించి ఊహకు అందటం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇటీవల రెండు వారాల క్రితం బాలల హక్కుల కమిషన్ బాలికల హాస్టల్‌ను సందర్శించినప్పుడు బాలికల బాధలన్నీ కమిషన్ ముందు ఏకరువు పెట్టారు. 230 మంది బాలికలు ఉంటున్న హాస్టల్‌కు రెండు సంవత్సరాల నుంచి ఇన్‌చార్జి వార్డెన్ విధులు నిర్వహిస్తుండటం గమనార్హం. ఒంగోలులోని ఒక హాస్టల్‌లో ప్రధాన పోస్టింగ్ కావడంతో అక్కడ విధులు చూసుకొని తీరిక ఉన్నప్పుడు మాత్రమే చీమకుర్తి బాలికల హాస్టల్‌ను వార్డెన్ సందర్శిస్తుంటారు. అప్పటి వరకు చీమకుర్తి బాలికల హాస్టల్‌లో ఆయాలు, వాచ్‌మెన్‌లే వార్డెన్లుగా చలామణీ అవుతుంటారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 230 మంది బాలికలున్న చీమకుర్తి హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్‌ను నియమించకపోవడం, జిల్లా సోషల్ డిపార్టుమెంట్ అధికారులు ఏమాత్రం ఆలోచించకపోవడం శోచనీయమని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత మంది బాలికలు ఉన్న చీమకుర్తి బాలికల హాస్టల్‌లో రాత్రి సమయాన బాలికలకు ఏమైనా జరిగితే అప్పటికప్పుడు వాచ్‌మెన్, ఆయాలు ఏం జాగ్రత్తలు తీసుకోగలరనే ఆందోళన వ్యక్తమవుతోంది. చీమకుర్తి ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఒకప్పుడు రెండు హాస్టళ్లను నిర్వహించేవారు. విద్యార్థుల హాజరు తగ్గిపోవడం వలన ప్రస్తుతం ఒకే హాస్టల్ నిర్వహిస్తున్నారు. 39 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వారికి నిర్మించిన టాయ్‌లెట్లకు తలుపులు, పైన శ్లాబులు లేవు. విద్యార్థులు నివసించే రూములకు, వరండాలలో సీలింగ్‌కు శ్లాబుల పెచ్చులు ఊడిపడుతుండటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సంతనూతలపాడు ఎస్సీ బాలుర హాస్టల్‌కు రెగ్యులర్‌గా ఉన్న సొంత భవనానికి మరమ్మతుల కారణంగా గత ఏడాది నుంచి అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. దానిలో విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు భవనం యజమాని దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండటం విశేషం.


ఒంగోలు అన్నవరప్పాడులో ఇరుకు గదుల్లో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహం


ఇరుకుగా ఉన్న మరుగుదొడ్లతో అవస్థపడుతున్న విద్యార్థులు


మొదటి అంతస్తులో ప్రమాదకర స్థితిలో ఆరుబయటే స్నానం చేస్తున్న విద్యార్థులు


మద్దిపాడు : బీసీ హాస్టల్లో మరుగుదొడ్లకు అధ్వానంగా ఉన్న తలుపులు

భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనా...

జిల్లా మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) నుంచి చీమకుర్తి సంతనూతలపాడులోని పలు హాస్టళ్ల భవనాల నిర్మాణాలకు, మరమ్మతులకు నిధులు ఏడాది క్రితం మంజూరయ్యాయి. చీమకుర్తిలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో ప్రస్తుతం ఉన్న హాస్టల్ సామర్థ్యం 100 మంది మాత్రమే. ప్రస్తుతం 230 మంది బాలికలు చేరటంతో వారికి సరిపోవడం లేదు. దీంతో డీఎంఎఫ్ నుంచి జిల్లా కలెక్టర్‌కు రూ.2 కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయి. వాటితో ఇప్పుడున్న హాస్టల్‌లోనే ఖాళీ స్థలంలో అదనపు భవనాన్ని నిర్మించేందుకు ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు తయారు చేశారు. మున్సిపాలిటీలో అనుమతులు కూడా తీసుకున్నారు. కానీ, భవన నిర్మాణానికి తదుపరి అడుగులు ముందుకు పడలేదు. అలాగే ఎస్సీ బాలుర హాస్టల్‌లో మరమ్మతులకు రూ.56 లక్షలు మంజూరు చేసినా హాస్టల్‌లో టాయ్‌లెట్ల మరమ్మతులతో పాటు భవనంలో ఇతర మరమ్మతులకు అడుగు ముందుకు పడలేదు. అలాగే సంతనూతలపాడు ఎస్సీ బాలుర హాస్టల్‌కు ఉన్న సొంత భవనం మరమ్మతుల దృష్ట్యా అద్దెభవనంలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. పర్మినెంట్ భవనం నిర్మించేందుకు డీఎంఎఫ్ నిధుల నుంచి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. పంచాయతీ గ్రామసభలో తీర్మానాలను ఇటీవలే తీసుకున్నారు.

రూ.46 లక్షలు మంజూరైనా...

చీమకుర్తి ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యారినుల సంఖ్య 100 నుంచి 230కి పెరగటంతో ఇప్పుడున్న రూములు చాలక రూ.2 కోట్ల నిధులను డీఎంఎఫ్ నుంచి మంజూరు చేశారు. వాటితో అదనపు భవనాన్ని నిర్మించేందుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. చీమకుర్తి ఎస్సీ బాలుర హాస్టల్‌కు రూ.46 లక్షలు మంజూరయ్యాయి. వాటితో విద్యార్థులకు అవసరమైన టాయ్‌లెట్లు, వసతి రూముల మరమ్మతులు చేయాల్సి ఉంది. ఆ మేరకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉండగా, ముందుకు మాత్రం సాగడం లేదు.

మద్దిపాడు ఎస్సీ హాస్టల్లో దోమల బెడద...

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడులోని ఎస్సీ హాస్టల్ వద్ద దోమలబెడద ఎక్కువగా ఉంది. పంచాయతీ పరిధిలో ఉన్న మురుగు కాలువ ఎస్సీ హాస్టల్ ముందుగా వెళ్తున్న క్రమంలో కాలువ నుంచి నీరు సర్వీస్ రోడ్డులోకి వెళ్లే మార్గంలో నీరు పోకపోవడంతో హాస్టల్ ముందు నీరు నిలిచిపోతోంది. దీంతో దోమలు తయారవుతున్నాయి. హాస్టల్ వార్డెను రూముల మొత్తానికి మెష్‌లు ఏర్పాటు చేసినా సాయంత్రం సమయంలో దోమలు ఎక్కువగా ఉంటున్నాయి. దోమల కారణంగా విద్యార్థులకు జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. బీసీ హాస్టల్‌లో టాయిలెట్లకు ఉండే డోర్లకు ఏర్పాటు చేసిన రేకులు చిరిగిపోయాయి. దీనిపై హాస్టల్ వార్డెన్‌ను వివరణ కోరగా, ఉన్నతాధికారులకు లెటర్ పెట్టామని, అనుమతులు రాగానే కొత్త డోర్లు చేయిస్తామని తెలిపారు.

మరుగుదొడ్లకు తలుపుల్లేవ్...

నాగులుప్పలపాడు మండలంలోని బీ నిడమానూరు ఎస్సీ హాస్టల్‌లో మరుగుదొడ్లకు తలుపులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని పోతవరం గ్రామంలో బీసీ హాస్టల్, అమ్మనబ్రోలులో గురుకుల హాస్టల్ ఉన్నాయి. వీటిలో అపరిశుభ్రత కనిపిస్తోందని స్థానికులు తెలిపారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, తద్వారా వారు ఆరోగ్యంగా ఉండేందుకు అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలి

ఒంగోలు సబర్బన్: నగరంలో రోడ్ల వెంట వ్యాపారాల కారణంగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్, పారిశుధ్య అధికారులతో కలిసి పాత మార్కెట్ సెంటర్ పరిసరాలతో పాటు కర్నూలు రోడ్డు, కొత్త కూరగాయల మార్కెట్ పరిసరాలు, అంజయ్య రోడ్డు, ముంగమూరు రోడ్డు, నెల్లూరు బస్టాండ్ సెంటర్, పేర్నమిట్ట రోడ్డు, తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. రోడ్డు మార్జిన్లలో ఆక్రమణలు తొలగించాలని సూచించారు.

పందులు, పశువులు రోడ్లపై తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి...

ఒంగోలు నగరంలో పందులు, పశువుల సంచారం ద్వారా దుర్గంధం వెదజల్లుతోందని కమిషనర్ వెంకటేశ్వరరావు అన్నారు. వాటి పెంపకందారులకు కొన్ని సూచనలు చేస్తూ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పందులు, పశువుల పెంపకందారులు వాటిని సంరక్షణ ప్రాంతాల్లోనే ఉంచాలని, బయట సంచరించకుండా చూడాలని ఆదేశించారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డీజేలను నియంత్రించండి

కొత్తపట్నం: డీజే సౌండ్ 60 డెసిబెల్స్ పెట్టాల్సి ఉండగా, 250 డెసిబెల్స్ పెడుతున్నారని, వాటిని నియంత్రించకపోవడంతో ప్రజలు ధ్వని కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కొత్తపట్నం గ్రామస్తులు శుక్రవారం ఎస్పీకి, స్థానిక తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా దోనె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఒంగోలు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కొత్తపట్నం సముద్ర తీర ప్రాంతానికి గణపతి విగ్రహాలను డీజే మ్యూజిక్‌ల ద్వారా నిమజ్జనానికి తరలిస్తున్నారన్నారు. డీజేల నుంచి వెలువడే విపరీతమైన ధ్వని కారణంగా గుండెజబ్బుల వారు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. విగ్రహాల ఊరేగింపులో డీజేలు లేకుండా పోలీసులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీను, హరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరద బాధితులకు మూడు వేల వాటర్ బాటిళ్లు

ఒంగోలు: వరద బాధితుల కోసం వడియరాజుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా నుంచి 3 వేల వాటర్ బాటిళ్లను శుక్రవారం విజయవాడ పంపారు. వడియరాజుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు, మహిళా అధ్యక్షురాలు చల్లా నాగేశ్వరమ్మ, జిల్లా అధ్యక్షుడు తన్నీరు వీరసాయి సుధాకర్, తన్నీరు రాము, కుంచాల వెంకటసాయి, అర్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో...

ఒంగోలు టౌన్: సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఒంగోలు నగరంలో రెండు రోజుల పాటు వరద బాధితుల కోసం విరాళాలు సేకరించినట్లు సీపీఐ నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి తెలిపారు. శుక్రవారం స్థానిక మల్లయ్య లింగం భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు రూ.60 వేలు సేకరించడం జరిగిందని, ఆ మొత్తాన్ని రాష్ట్ర నాయకుల ద్వారా వరద బాధితులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు శ్రీరాం శ్రీనివాసరావు, ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ సాలార్, బీఎస్ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె.అంజయ్య, కారుమూడి నాగేశ్వరరావు, పీవీ కృష్ణారావు, పాటికొండ సిద్దయ్య, రామినేని శివనాగేశ్వరరావు, సయ్యద్ సర్దార్, బూదూరి హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయం సరిపోవడం లేదు...

విజయవాడ వరద బాధితులకు ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు స్వయంగా వెళ్లి ఆహారం, బిస్కెట్లు, మంచినీళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ మాట్లాడుతూ వరద బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం ఏమాత్రం సరిపోవడం లేదని తెలిపారు. పేద, ధనిక తేడా లేకుండా ప్రతిఒక్కరూ కట్టుబట్టలతో రోడ్డున పడ్డారని, కష్టపడి కట్టించుకున్న ఇళ్లు, ఇంటిలోని వస్తువులన్నీ నీటిలో కొట్టుకుపోయాయని, వారం రోజులు కావస్తున్నా నీటి ప్రవాహం తగ్గలేదని తెలిపారు. ప్రభుత్వం క్షేత్రస్థాయికి వెళ్లడం లేదని, చివరి పౌరుడికి కూడా సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వరద బాధితులకు సాయపడేందుకు యువకులు, విద్యార్థులు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బి.వీరాస్వామి, మరో 8 మంది ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొని సేవలందించారు.

రైతులంతా ఈ-పంట నమోదు చేయించుకోవాలి

మద్దిపాడు: రైతులంతా ఈ-పంట యాప్‌లో వారు సాగుచేసిన పంటలను నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మద్దిపాడు మండలంలోని ఇనమనమెళ్లూరు, నందిపాడు గ్రామాల్లో ఈ-పంట నమోదు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమై ఆయన మాట్లాడారు. ఈ పంటలో నమోదు చేయడం వలన పంట నష్టం జరిగితే పరిహారం అందించేందుకు వీలుంటుందని తెలిపారు. ఈ-పంట నమోదు వలన రైతులు, కౌలు రైతులు కూడా బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే స్కీములు పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. పంట నమోదు అనంతరం ఈకేవైసీ చేయించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రమేష్, మండల వ్యవసాయశాఖ అధికారి కె.రమేష్, వీఏఏలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

చీమకుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. చీమకుర్తిలోని చెరుకూరి వెంకటేశ్వర్లు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని కొనియాడారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులు మన్నం సుబ్బారావు, సుంకేసుర శ్రీనివాసరావు, బందెల ఆంజనేయులు, కవర్దపు సుజిత, డీ భార్గవి, కత్తి రాజ్యలక్ష్మి, పీ రమేష్, ఏ ఉషశేష, తాటికొండ మాధవి, ఎస్‌కే పీరా మహ్మద్, పిల్లి రమణమ్మ, కోటిరెడ్డి, ఎద్దు రమేష్‌లను సన్మానించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు కడవా రామకృష్ణ, సెక్రటరీ కందుకూరి సుధాకర్, అంబటి వీరారెడ్డి, పోకూరి రామకృష్ణారెడ్డి, పోకూరి తిరువెంగళం, నాగెళ్ల సత్యం, తొగటి శ్రీను, వాసి వెంకటేశ్వర్లు, దొంతు సోమయ్య, రామాంజనేయులు, వీరనారాయణ పాల్గొన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
ITL DI 745 OIB PS 2023
MODEL AP39 HU 8279
Cell : 91335 33003
37-1-4, 2nd Floor, Vara Prasad Complex, Beside East KB Restaurant, Trunk Road, ONGOLE.

రేషన్ షాపు డీలర్ పోస్టుకు న్యాయం చేయండి

చీమకుర్తి: రేషన్ షాపు డీలర్‌షిప్ పోస్టు నియామకంలో అవకతవకలు జరిగాయని మండలంలోని గాడిపర్తివారిపాలెం గ్రామానికి చెందిన నారిపెద్ది వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు జరిగిన అన్యాయంపై శుక్రవారం చీమకుర్తిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశాడు. గ్రామంలో ఇటీవల ఖాళీ అయిన డీలర్‌షిప్ పోస్టుకు దరఖాస్తులను అధికారులు స్వీకరించగా, 8 మంది నుంచి దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వారిలో నారిపెద్ది అంజమ్మకు 10వ తరగతి అర్హత ఉన్నప్పటికీ.. ఆమెకు డీలర్‌షిప్ ఇవ్వకుండా 7వ తరగతి అర్హత ఉన్న మహిళకు ఇచ్చారని వెంకట్రావు తెలిపాడు. దీనిపై తహసీల్దార్ బ్రహ్మయ్యను వివరణ కోరగా, అత్యవసరంగా ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు తాత్కాలికంగా రేషన్ షాపు డీలర్‌ను నియమించామని తెలిపారు. నారిపెద్ది వెంకట్రావు ఫిర్యాదు మేరకు మరోసారి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాత్రికేయుల సేవలు అమూల్యం

ఒంగోలు మెట్రో: పాత్రికేయుల సేవలు అమూల్యమని వాసవీ క్లబ్ సభ్యులు కొనియాడారు. వాసవీ క్లబ్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాత్రికేయ దినోత్సవం నిర్వహించారు. నగరంలోని గాంధీ రోడ్డు శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ ఒంగోలు అధ్యక్షుడు నల్లమల్లి బదరీనారాయణ, కేసీజీఎఫ్ యూత్ అధ్యక్షుడు కూనల శ్రీనివాసరావు, వాసవీ జిల్లా 205 రక్తదాన శిబిరాల ఇన్‌చార్జ్ జి.బ్రహ్మానందం, పబ్బిశెట్టి వినోద్ కుమార్, దర్శి మనోహర్ చంద్రశేఖర్, తుమ్మపూడి బుచ్చిబాబు, నందకుమార్, కె.పవన్ కుమార్, భూమా శ్రీనివాసులు, గుర్రం కృష్ణ, మిరియాల కృష్ణ, సామి రాఘవేంద్ర తదితరులు పాల్గొని పలువురు పాత్రికేయులను సత్కరించారు.

సంతనూతలపాడులో...

చీమకుర్తి: వాసవీ వారోత్సవాల్లో భాగంగా సంతనూతలపాడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన పాత్రికేయ దినోత్సవంలో వాసవీ క్లబ్, మహిళా క్లబ్ సభ్యులు పాల్గొని జర్నలిస్ట్ శ్రీనివాసరావును సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వాసవీక్లబ్, మహిళా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు వేమూరి వెంకట శేషారావు, జయశ్రీ, నాగేంద్రప్రసాద్, మట్టా పోలిశెట్టి, చలువాది రాము, స్థానికులు పాల్గొన్నారు.

ఉచితంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

ఒంగోలు మెట్రో: వినాయకచవితి పండుగను పురస్కరించుకుని శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ, ఒంగోలు ఎయిమ్స్ క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బొమ్మిశెట్టి వారి అక్షయ జ్యువెలరీస్ అధినేత బొమ్మిశెట్టి కౌశిక్ సహకారంతో శుక్రవారం ఉదయం ఒంగోలు నగర ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీ గిరి గిరి ప్రదక్షిణ కమిటీ ప్రతినిధి రాధారమణగుప్తా జంధ్యం, ఎయిమ్స్ క్లబ్ ఒంగోలు ప్రతినిధులు తుమ్మపూడి బుచ్చిబాబు, తుమ్మపూడి ఏడుకొండలు, శెనగేపల్లి నాగాంజనేయులు, తీగల సత్యవతి, బి.విజయరావు, గుర్రం కృష్ణ, డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ, శ్రీగిరి ప్రదక్షిణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో...

ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో తాతా బద్రీనాథ్ నేతృత్వంలో కోడూరి కిషోర్, గుర్రం బద్రి, బియ్యపు విజయ్ సహకారంతో స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద, తాతా బిల్డింగ్స్ వద్ద మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు ఉచితంగా అందజేశారు.

విగ్రహాలకు అనుమతులు లేకుంటే చర్యలు

కొత్తపట్నం: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో అనుమతులు లేకుండా వినాయక విగ్రహాలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుధాకర్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఏ ప్రాంతంలో విగ్రహాలు పెడతున్నారో ముందుగా పోలీస్‌స్టేషన్‌కి వచ్చి అనుమతులు తీసుకోవాలని కోరారు. విగ్రహాలు పెడుతున్న ప్రాంతంలో పెద్దలు 10 మంది వచ్చి ఎస్సైని కలిసి సమాచారం ఇవ్వాలన్నారు. వినాయకచవితి అయిపోయిన 11 రోజుల్లోపు విగ్రహాలను నిమజ్జనం చేయాలని సూచించారు. అంతకుమించి ఎక్కువ రోజులు గడిస్తే పోలీస్ వారే నిమజ్జనం చేస్తారని చెప్పారు. విద్యుత్ లైన్లు సక్రమంగా వేసుకోవడం, ధ్వనికాలుష్యం లేకుండా చూడటం, విగ్రహాల దగ్గర ఎక్కువ సౌండ్ పెట్టి ఇబ్బంది కలిగించకపోవడం వంటివి పాటించాలని స్పష్టం చేశారు. రికార్డింగ్ డ్యాన్స్‌లు, పాటకచేరీలు వద్దని తెలిపారు.


కాంట్రాక్టు నర్సులను రెగ్యులర్ పోస్టుల్లో నియమించాలి

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న నర్సింగ్ పోస్టుల్లో అన్నీ అర్హతలు కలిగి ఉండి ప్రస్తుతం కాంట్రాక్టు బేసిక్‌లో స్టాఫ్ నర్సులుగా విధులు నిర్వహిస్తున్న వారితో భర్తీ చేయాలని ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి ఉదయలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.దుర్గాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 2 లక్షల మంది సుశిక్షితులైన నర్సులు ఉన్నారని, ప్రభుత్వ ఉద్యోగాలు రాకపోవడంతో అరకొర జీతాలతో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ బతుకుబండిని నడుపుతున్నారని చెప్పారు. ఇంటెన్సిఫైడ్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులతో నర్సింగ్ పోస్టులు భర్తీ చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం సరైన నిర్ణయం కాదన్నారు.

మహిళా కాలేజీలో ఘనంగా ఫ్రెషర్స్ డే

ఒంగోలు: స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం కోర్సుల్లో చేరిన విద్యార్థినులకు దీక్షారంభ్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి మాట్లాడుతూ కాలేజీలో ప్రవేశం పొందిన వారికి కాలేజీలో గల వివిధ విభాగాలతో, అందరి అధ్యాపకులతో పరిచయం, అవగాహన అవసరమని అన్నారు. దీనివల్ల కాలేజీకి సంబంధించిన సమాచారం మొత్తం తెలుసుకోవడంతో పాటు అందరికీ అందుబాటులో ఉండే సేవలు, వివిధ కోర్సుల గురించి తెలుస్తుందన్నారు. అందుకోసం ఫ్రెషర్స్‌డే కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ శ్రీనివాసరావు, ఎం.సుధారాణి, కె.అరుణకుమారి, ఏవీ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుణ్ణి పూజిద్దాం... పర్యావరణాన్ని కాపాడుదాం...



దేవుడు మరియు దేవతలను పూజించడానికి సాధారణంగా పాలు, పెరుగు, నెయ్యి, కొబ్బరి, తమలపాకులు మరియు నదీ జలాల వంటి సహజమైనవస్తువులను ఉపయోగిస్తారు. సాధారణంగా విగ్రహాలు మట్టి లేదా స్థానికంగా లభించే పదార్థాలతో తయారు చేయబడతాయి మరియు చందనం, పసుపు మొదలైన సహజ పదార్థాలతో రంగులు వేయబడేవి.

భగవద్గీత (9.26) ఇలా పేర్కొంది.
"పత్రం పుష్పం ఫలం తోయం. యో యే భక్త్యా ప్రయచ్ఛతి. తదహం భక్త యూపహృతం అశ్నామి ప్రయతాత్మనః"..

దీని అర్థం: "ఒక పండు, ఒక పువ్వు, ఒక ఆకు లేదా నీరు కూడా ప్రేమతో మరియు భక్తితో స్వచ్ఛమైన స్పృహతో నాకు సమర్పిస్తే, నేను ఆ అందించిన దాన్ని ఆనందంగా తీసుకుంటాను".

గణేష్ విగ్రహాల తయారీకి మట్టిని ఉపయోగిస్తారు. అయితే సంవత్సరాలుగా, తేలికైన మరియు చౌకైన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (POP) విగ్రహాలను అచ్చు వేయడానికి ఇష్టపడే పదార్థంగా మారింది. POPలో జిప్సం, సల్ఫర్, ఫాస్పరస్ మరియు మెగ్నీషియం వంటి రసాయనాలు ఉంటాయి. ఈ విగ్రహాలకు రంగులు వేయడానికి ఉపయోగించే రంగులలో పాదరసం, కాడ్మియం, ఆర్సెనిక్, సీసం వంటి భారీ లోహాలు కూడా ఉండవచ్చు. ఈ విగ్రహాలను అలంకరించేందుకు ప్లాస్టిక్ మరియు థర్మాకోల్ ఉపకరణాలు ఉపయోగిస్తారు. ఇటువంటి పదార్థాలు జీవఅధోకరణం చెందవు. అందువల్ల నీటి వనరులలో ముంచినప్పుడు నీరు విషపూరితం అవుతాయి. అందుకే విగ్రహ నిమజ్జనానికి సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించాల్సిన అవసరం ఉందని భావించి కేంద్ర కాలుష్యనియంత్రణ మండలి వారు విగ్రహాల నిమజ్జనం కోసం మార్గదర్శకాలను మే 2020న రూపొందించింది. ఈ మార్గదర్శకాలను ఇప్పటికే అన్ని మున్సిపాలిటీలకు, పంచాయితీలకు అమలు చేయమని ఆదేశించడం జరిగినది. ప్రజలందరూ పర్యావరణహితంగా మట్టి గణపతిని పూజించి విగ్రహాల నిమజ్జన సమయంలో తాత్కాలిక నీటి తొట్టిలు ఏర్పాటు చేసుకొని చెరువులను, కుంటలను, నదులను మరియు సముద్రాన్ని కాలుష్యం నుండి కాపాడే బాధ్యత తీసుకుంటారని కోరడమైనది.

జిల్లా అధికార యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు, ప్రజలకు, శ్రేయోభిలాషులకు
వినాయక చవితి శుభాకాంక్షలు

ఆంధ్రప్రదేశ్ కాలుష్యనియంత్రణ మండలి
ప్రాంతీయ కార్యాలయం